క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మకు పూజలు



రేణుకా ఎల్లమ్మకు మంగళహారతి ఇస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆదోని అర్బన్: ఆషాఢమాసం సందర్భంగా 2వ మంగళవారం ఎల్లమ్మవ్వ కొండలో వెలిసిన శ్రీ రేణుకాఎల్లమ్మకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వేకువజామునే అవ్వకు పంచామృతాభిషేకం, పూలు, వెండి, బంగారు అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మవారిని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు



గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఉప సంచాలకులు వెంకటరమణ

నందవరం : మండలంలోని పెద్దకొత్తిలి గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆదోని ఉప సంచాలకులు వెంకట రమణ నేతృత్వంలో పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. పంచాయతీ పరిధిలోని ఆవులు, గెదెలకు చూలు పరీక్షలు నిర్వహించారు. పశువులకు టీకాలు, మందులు వేశారు. అనంతరం రైతులకు మేలుజాతి రకం గడ్డి విత్తనాలను సరఫరా చేశారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్య ఆచారి, పశు వైద్యులు నరేంద్ర నాథ్ రెడ్డి, నరేంద్ర, బెన్ని హేమంత్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం



ప్రాజెక్టులపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని టౌన్: నియోజకవర్గంలో సాగు, తాగు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. మంగళవారం ఆయన ఇరిగేషన్ అధికారులు, ఇంజినీర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఆయకట్టు భూమికి, ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందించేందుకు టీబీ అధికారులతో మాట్లాడి సుమారు 6 వేల ఎకరాల ఆయకట్టు భూమికి సాగునీరు అందిస్తున్నామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో టీబీ డ్యాం గేట్లు ఎత్తివేస్తారని, తాగునీటి కొరత ఉండదని చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీఆర్‌పీ భీమేష్

కోసిగి: గర్భిణులు, బాలింతలు సంపూర్ణ పోషకాలు అందించే ఆహార పదార్థాలు తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ సీఆర్‌పీ భీమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పల్లెపాడు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఐసీడీఎస్ వారి సమక్షంలో గర్భిణులు, బాలింతలకు వైవిధ్య భరిత ఆహారంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, అధిక మోతాదులో తీసుకోవాలన్నారు. తద్వారా పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

అను మంత్రాలయం మఠంలో చోరీ



మంత్రాలయం: అను మంత్రాలయంగా పేరుగాంచిన తుంగభద్ర రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. మఠంలోని హుండీ తాళాలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లినట్లు మాధవరం ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఈ ఏడాది మార్చి నెల నుంచి ఇప్పటి వరకు హుండీని లెక్కించలేదని, హుండీలో దాదాపు రూ.30 వేల వరకు న గదు ఉన్నట్లు భావిస్తున్నామని వివరించారు. మఠం అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధి పథంలో ఈరన్నస్వామి ఆలయం

- ఐదేళ్లలో భారీగా పెరిగిన ఆదాయం
- ఆలయంలో చురుగ్గా అభివృద్ధి పనులు
- దేవాలయానికి డిప్యూటీ కమిషనర్ హోదా ప్రకటించిన గత ప్రభుత్వం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. గత ఐదు సంవత్సరాల్లో ఆలయంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. ఆలయానికి ఏటేటా ఆదాయం పెరుగుతుండగా.. అందుకు అనుగుణంగా భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దీంతో పాటు గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆలయానికి డిప్యూటీ కమిషనర్ హోదా కూడా ప్రకటించింది.

గత ఐదేళ్లలో దేవాలయం ఆదాయం

ఈరన్నస్వామి ఆలయానికి వివిధ మార్గాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పరిశీలిస్తే 2018–19లో రూ.10,67,28,610 ఆదాయం వచ్చింది, 2019–20లో రూ.11,75,08,499, 2020–21లో రూ.11,48,02,640, 2021–22 ఏడాదికి కరోనా కారణంగా రూ.05,44,68,402 ఆదాయం వచ్చినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. 2022–23కు గాను రూ.12,77,19,856, ఈ ఏడాది 2023–24కు రూ.15,60,16,129 ఆదాయం చేకూరింది. ఇలా ప్రతి ఏడాది ఆదాయం పెరుగుతునే ఉంది.

దేవాలయానికి డిప్యూటీ కమిషనర్ హోదా

ఈరన్నస్వామి ఆలయానికి డిప్యూటీ కమిషనర్ హోదాను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 29న ప్రకటించింది. దీంతో ఫిబ్రవరి 7న ఇక్కడికి డిప్యూటీ కమిషనర్‌గా శ్రీశైలంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న హెచ్.జి. వెంకటేశ్ పదోన్నతిపై బాధ్యతలు చేపట్టారు. ఈయన వచ్చిన తర్వాత దేవాలయం వద్ద పనులను చక్క పెడుతున్నారు. ఆలయానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకున్నారు.



నిర్మాణం పూర్తయిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ రాజగోపురం

➤హుండీల ఆదాయం ఇలా..

2014–15లో హుండీల ద్వారా రూ.3,70,27,686 ఆదాయం వచ్చింది. 2015–16లో రూ.4,23,44,292, 2016–17లో రూ.3,91,74,530, 2017–18లో రూ.5,33,07,297, 2018–19లో రూ.5,96,68,826, 2019–20లో రూ.5,41,34,912, 2020–21లో రూ.2,70,05,310, 2021–22లో రూ.6,41,13,377, 2022–23లో రూ.6,71,25,698, 2023–24లో రూ.10,24,06,528 ఆదాయం వచ్చింది.

దేవుని సొమ్ము ఆలయానికి చేరేలా చర్యలు



దేవుని సొమ్ము ఆలయానికి చేరేలా చర్యలు తీసుకున్నాం. గర్భగుడిలో భక్తులు తమ కానుకలను హుండిలోనే వేసే విధంగా చర్యలు తీసుకున్నాం. అర్చకుల హారతి ప్లేట్స్‌లలో వేసిన డబ్బులు కూడా హుండిలోనే వేసే విధంగా ఆదేశాలు జారీ చేశాం. కొంతమంది అర్చకులు హారతి పళ్లేంలో వేసిన కానుకలను హుండిలో వేయకుండా తీసుకున్నందుకు జరిమానాలు విధించాం. అలాగే తలనీలాల వద్ద క్షురకులు దేవాలయం వారు కేటాయించన మొత్తాన్ని వసూలుకు అదనంగా వసూలు చేయడంతో వారికి కూడా ఫైన్ వేశాం. – హెచ్.జి. వెంకటేశ్, డిప్యూటీ కమిషనర్



దేవాలయం ఆవరణలో బండ పరుపు

➤ఆలయంలో అభివృద్ధి పనులు

దేవాలయం వద్ద నాలుగు రాజగోపురాల నిర్మాణాలు రూ.9.80కోట్లతో పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే రూ.4.65 కోట్ల నిధులతో ప్రకార నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించారు, రూ.1.56కోట్లతో పర్మనెంట్ క్యూ లైన్స్‌ను పూర్తి చేసి ప్రారంభించారు, 1.28కోట్లతో దేవాలయ ఆవరణలో బండ పరుపు పూర్తయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

చేపల పెంపకానికి 23న బహిరంగ వేలం

కోసిగి: మండల కేంద్రం సమీపంలోని పులికనుమ రిజర్వాయర్‌లో మత్స్య సంపద పెంపకానికి ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆదోని డివిజనల్ మత్స్య సహాయక పర్యవేక్షకులు డి.నాగరాజు మంగళవారం తెలిపారు. 01.07.2024 నుంచి 30.06.2025వ తేదీ వరకు పులికనుమ రిజర్వాయర్‌లో చేపలను పెంచుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 23న కోసిగి మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన చేపల పెంపకం దారులు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

పీర్లకు ఫాతెహాలు



హసేన్, హుసేన్ పీర్ల వద్ద ఫాతెహాలు

కౌతాళం: మోహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి మండల కేంద్రమైన కౌతాళంలోని హసన్, హుసేన్ పీర్ల చావిడిలో ఫాతెహాలు ప్రారంభం అయ్యాయి. బుధవారం తెల్లవారు జామున 5గంటల వరకు ఉత్సవం సాగుతుందని ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు. మంగళవారం రాత్రి హసన్ హుసేన్, బార ఇమామ్ పీర్ల చావిడి, ముల్లారు వీధి, పింజారి వీధుల్లో పీర్ల వద్ద భక్తులు బారులు తీరి ఫాతెహాలు సమర్పించారు. హాల్వి, బదినేహాల్, కుంటనహాల్, నదిచాగి, సుళేకేరి, ఏరిగేరి, కామవరం, బాపురం, ఉప్పరహాల్, చూడి, చిరుతపల్లి గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు



గోనెగండ్లలో పూజలందుకుంటున్న పీర్ల దేవుళ్లు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలల్లో భాగంగా పెద్ద సరిగెత్తు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు మేళతాళాలతో పీర్ల చావిడీల వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాయి గుంతలో నిప్పులపై నడిచి తమ భక్తిని చాటుకున్నారు. పీర్ల దేవుళ్లను పూలదండలతో, వెండి ఆభరణాలతో అలంకరించారు. పలు విచిత్ర వేశ ధారణలు ఆకట్టుకున్నాయి.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

నేడు జరిగే మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ రామకృష్ణయ్య సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పండుగ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని, మత పెద్దలు, గ్రామ పెద్దలకు తెలియజేశారు. అలాగే సాయంత్రం పీర్ల దేవుళ్లను ఊరేగింపు సమయంలో, దేవుళ్లను ఏటీకి పంపే సమయంలో కూడా అల్లర్లు చేయకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం జరుపుకోవాలని కోరారు.

సుంకేశ్వరిలో జెడ్పీ సీఈఓ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

మంత్రాలయం : మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో అతిసార ప్రబలిన విషయం విధితమే. మంగళవారం జెడ్పీ సీఈవో నాసరరెడ్డి గ్రామంలో పర్యటించారు. పురవీధుల్లో తిరిగి అతిసార వ్యాధి సోకడానికి కారణాలు తెలుసుకున్నారు. బోరును పరిశీలించి తాగునీరు కలుషితమవుతున్న తీరును రాబట్టారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ, మండల అభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాలకు ఎలాంటి ఆపద రాకుండా చూసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా ఆదోని, ఎమ్మిగనూరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులు చాలా మంది కోలుకొని గ్రామానికి చేరుకున్నారు. గ్రామ వైద్య శిబిరంలో స్థానికులు కొందరు పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీడీఓ మునెప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ వేద స్వరూప, ఈఓపీఆర్‌డీ ప్రభావతి, వైద్యాధికారులు సురేష్, వసంత పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కాలిపోయిన నగదు, విలువైన పత్రాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర కాలనీలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో వడ్డే శ్రీను అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమయ్యింది. వడ్డే శ్రీను, భార్య మహేశ్వరి గుడిసెకు తాళం వేసి పనులకు వెళ్లారు. సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. కొద్ది సేపటికి అక్కడికి చేరుకును అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు, దుస్తులు, విలువైన పత్రాలు, శ్రీను కుమారుడు సంతోష్‌కు సంబంధించిన ఎంబీఏ సర్టిఫికెట్లు పూర్తిగా కాలిబూడిద అయ్యాయిని బాధితుడు వాపోయాడు. ప్రమాదంలో దాదాపు రూ. 15లక్షలు పైగా నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడని అగ్నిమాపక ఎస్‌ఐ రామాంజనేయులు చెప్పారు.

కర్ణాటక మద్యం రవాణాపై ఉక్కుపాదం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ శివనారాయణ స్వామి అన్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్, బోయగేరికి చెందిన ఇద్దరు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన మద్యం, ముద్దాయిల వివరాలను విలేకరులకు వెల్లడించారు. వాల్మీకినగర్‌కు చెందిన బోయ నాగరాజు, బోయగేరికి చెందిన బోయ శివలు కర్ణాటక రాష్ట్రంలోని నాగరహాల్ నుంచి వైన్‌షాపులో 9 లిక్కర్‌బాక్సులను కొనుగోలు చేసి స్కూటీ(ఏపీ21సీసీ8460)పై తరలిస్తుండగా పట్టణ శివారులోని ఇస్వీకి వెళ్లే రహదారిలోని బాలకొలను వద్ద పట్టుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో వన్‌టౌన్ సీఐ తేజమూర్తి, ఎస్‌ఐ మధుసూదన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆదోని సబ్‌కలెక్టర్ వారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆదోని పట్టణంలో పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉన్నందువల్ల వాటిపై ప్రత్యేకమైన దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా నో పార్కింగ్ ఏరియాలో వాహనాలు నిలుపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో జనసాంద్రత ఉన్న ప్రదేశాల్లో పబ్లిక్ టాయిలెట్స్ సంఖ్యను పెంచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడైనా కట్టడాలు జరిగితే గుర్తించి విచారణ చేసి తొలగించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్‌రెడ్డి, ఆర్టీఓ నాగేంద్ర, ఎంవీఐ సిసిర దీప్తి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్: ఈనెల 20న రాజమండ్రిలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కౌన్సిల్ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు, బహుళ కంపెనీలకు మరింత ఊడిగం చేస్తుందన్నారు. వ్యవసాయ రంగంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వ నాశనం చేస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను సమరశీల పోరాటలతో ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర కౌన్సిల్‌లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామలింగయ్య, రంగన్న, ఈరన్న, రామకృష్ణ, నాగేంద్ర, జన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో తాగునీటిని అందించాలి

ఆదోని రూరల్: ఎండిపోయిన కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీటిని అందించాలని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న, మండల నాయకులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని ఏడు గ్రామాలకు తాగునీటిని అందించేందుకు కుప్పగల్ ఫారెస్ట్ సమీపంలో కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకును నిర్మించారన్నారు. ఈ ఎస్ఎస్ ట్యాంకు ఎండిపోయి దాదాపు పది రోజులవుతున్నా ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో పది రోజులుగా ప్రజలకు నీరు లేక పెద్దతుంబళం, కుప్పగల్, బల్లేకల్, పాండవగల్, జాలమంచి, గణేకల్, ఇస్వీ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కృష్ణ, వై.ఉసేని, పాండురంగ, గోవిందు, వెంకటేష్, కృష్ణ, ఉరుకుందు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

పీర్ల దేవుళ్లను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



పీర్లచావిడిలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు విరూపాక్షి, బాలనాగిరెడ్డి

హాలహర్వి: మండలంలోని కామినహాల్ గ్రామంలో హజరత్ ఇమాం హుసేన్, హుసేన్ పీర్ల దేవుళ్లను మంగళవారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. పీర్లదేవుళ్లకు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పీర్లదేవుళ్ల ఆశీస్సులతో అందరికీ మంచి కలగాలని, వర్షాలు సకాలంలో కురిసి రైతులు, పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, సీనియర్ నాయకులు వైకుంఠం మల్లికార్జునచౌదరి, కృష్ణమోహన్, శశికళ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్‌నాయుడు, నాయకులు మారయ్య, అరికెర వీరేష్, చెన్నప్ప, గోపాల్ తదితరులు ఉన్నారు.

శాకాంబరీ అలంకరణలో అంబాభవాని




శాకాంబరీ అలంకారంలో అంబాభవానీ మాత, తాయమ్మవ్వ

ఆదోని అర్బన్: పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన శ్రీ అంబాభవానీ దేవస్థానంలో ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం ఉదయం శాకాంబరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు దుర్గామారుతి ఆధ్వర్యంలో అమ్మవారికి 21 రకాల కాయగూరలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. జల, పుష్ప, పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేపట్టారు. అలాగే ఈశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

తాయమ్మవ్వకు శాకాంబరీ అలంకారం

ఎస్‌కేడీ కాలనీలో వెలిసిన శ్రీ తాయమ్మ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం అమ్మవారు శాకంబరీ మాత అలంకారంలో దర్శనమిచ్చారు. పట్టణ వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) మహిళా విభాగ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకారం చేసి లలితా సహస్రనామం, దేవీ ఖడ్గమాల స్తోత్రం పారాయణం చేసి, తీర్థ ప్రసా దం అందించినట్లు ఆదోని పట్టణ వామ్ అధ్యక్షురాలు వంకదారి మమతాశ్రీ తెలిపారు. వామ్ ఉపాధ్యక్షురాలు ఇల్లూరి అనిత శ్రీనివాసులు దంపతులు కాలనీవాసుల సాయంతో అమ్మవారిని శాకాంబరీగా అలంకరించాలని కార్యక్రమంలో వామ్ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, ఎస్.శ్రీదేవి, కోశాధికారి అనూష, సభ్యులు అనిత పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నందవరం : ముచ్చమరి గ్రామంలో 9ఏళ్ల బాలికపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌ఏవీఎఫ్), డీఎస్‌వైఏ సంఘాల నాయకులు కృష్ణ, ఖాజా, వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చిన్నారి చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ..9ఏళ్ల చిన్నారిపై అఘాత్యానికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలను తీసుకురావాలన్నారు. 10 రోజులైన మృతదేహం లభించకపోవడం ఏంటని ప్రభుత్వాని ప్రశ్నించారు. విద్యార్థి సంఘాల నాయకులు మల్లికార్జున, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ వేలం వాయిదా



మార్కెట్లలో సమస్యలు, మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వివరిస్తున్న వ్యాపారులు

ఆదోని టౌన్: 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆదోని మున్సిపాలిటీలో కూరగాయలు, పశువులు, గొర్రెలు, మేకల వారపు సంత, కమేళా తదితర వాటికి సంబంధించిన వేలం పాటలు వాయిదా పడ్డాయి. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో కమిషనర్ రామచంద్రారెడ్డి, టీపీఓ అస్లాంబాషా ఆధ్వర్యంలో మార్కెట్ల వేలం పాటలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హాజరయ్యారు. ముందుగా ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌కు వేలం పాటలు నిర్వహించగా.. ఏడుగురు వ్యాపారులు ఒక్కొక్కరు రూ.10 లక్షలు చొప్పున డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. అయితే వేలం పాట ప్రారంభంలోనే కొంతమంది వ్యాపారులు కూరగాయల మార్కెట్‌ను మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకురావాలని అధికారులను కోరారు. స్థలాలు అనుకూలంగా లేవని, వసతులు కల్పించలేమని అధికారులు తమ వాదనను వినిపించారు. దీంతో వ్యాపారులు వసతులు లేకుండా మార్కెట్‌ల నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని ప్రశ్నించారు. మార్కెట్‌లలో వసతుల కల్పనపై సమీక్షిద్దామని, ముందుగా మార్కెట్లకు అనుకూలంగా ఉండే ఖాళీ స్థలాలను పరిశీలిద్దామని, తదనంతరం వేలం పాటలను వేద్దామని ఎమ్మెల్యే వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు ఎమ్మెల్యే మాటలతో ఏకీభవించారు. దీంతో మార్కెట్‌ల వేలం పాటలు ఈనెల 23వ తేదీకి వాయిదా వేశారు.

అక్రమ కట్టడాలపై సమీక్ష

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలను కూల్చివేసి, పట్టణాభివృద్ధి, ప్రజలకు సౌకర్యంగా ఉంచాలని వ్యాపారులు, ప్రముఖులు, కౌన్సిలర్లు ఎమ్మెల్యే పార్థసారథి, కమిషనర్, టీపీఓ ఆర్వో అస్లాంబాషా దృష్టికి తీసుకొచ్చారు. పట్టణాన్ని వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటే అక్రమ కట్టడాలను కూల్చివేయాలన్నారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పట్టణంలో ఎక్కడ కూడా అక్రమ కట్టడం అన్నదే కనిపించకుండా చేస్తానని, అందుకు ప్రజలు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

భూ యజమానులకు నష్టం ఉండదు

పెద్దకడబూరు : కౌలుదారులు కౌలు పత్రం పొందేందుకు అవసరమయ్యే అంగీకార పత్రం మీద సంతకం చేయడం వలన భూ యజమానికి ఎటువంటి నష్టం జరగడం ఏఓ ఎం.వరప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామం రైతుసేవా కేంద్రంలో వీఆర్‌ఓ విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌలు ధ్రువీకరణ పత్రము ప్రాముఖ్యతపై రైతులకు, భూ యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు పత్రం పొందిన రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలన్నీ (పంట నష్టము, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వ పథకాలు) వర్తిస్తాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని భూ యజమానులు కౌలు ధ్రువీకరణ పత్రము ఇవ్వడానికి ఒప్పుకోవాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నందవరం: వర్షాకాలం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామాల్లో మురుగు కాలువలు, నీటి కుంటలు, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. గ్రామస్తులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.